
రాహుల్‌తో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ

- జూబ్లీహిల్స్ బైపోల్‌లో విజయంపై అగ్రనేత అభినందనలు
- సిఎం వెంట మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్, నవీన్ యాదవ్
- రాహుల్‌గాంధీకి నవీన్‌యాదవ్‌ను పరిచయం చేసిన రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి బృందానికి కెసి వేణుగోపాల్ శుభాకాంక్షలు


రాహుల్‌ను కలిసిన సిఎం రేవంత్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయంపై సిఎం రేవంత్ రెడ్డిని పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మెచ్చుకున్నారు. మంత్రివర్గం నుంచి పార్టీ కార్యకర్త వరకు ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని గెలుపు తీరాలకు చేర్చినందుకు సిఎం బృందానికి రాహుల్‌తో పాటు కె.సి వేణుగోపాల్ సైతం శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఢిల్లీలోని పది జన్‌పథ్‌లో సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని టీమ్.. రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసింది. సిఎంతో పాటు పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఖైరతాబాద్ డిసిసి చీఫ్ రోహిన్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్ యాదవ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి నవీన్ యాదవ్‌ను సిఎం పరిచయం చేశారు. బిఆర్ఎస్ ఇలాకాలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడంలో పార్టీ శ్రేణుల చేసిన కృషిని వివరించారు. పార్టీ విజయం కోసం ప్రచారం మొదలు, బూత్ లెవల్ వరకు కార్యకర్తలే ముందుండి పోరాడారన్నారు. ఘనవిజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి రాహుల్ అభినందించారు. అలాగే ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఖర్గేతోనూ భేటీ

తర్వాత ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో రేవంత్‌రెడ్డి బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం సాధించిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను ఖర్గే అభినందించారు. ఖర్గేతో కూడా సిఎం బృందం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించినట్టుగా సమాచారం. అంతకుముందు కె.సి వేణుగోపాల్‌తో కాసేపు సిఎం, రాష్ట్ర ముఖ్యనేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా పరిస్థితులను సీఎం ఆయనకు వివరించారు. జూబ్లీహిల్స్ భారీ గెలుపుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు, ఈ విషయంలో హైకోర్టు ఆదేశాలు, డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ, మంత్రి వర్గం వంటి పలు అంశాలపై చర్చించినట్టు తెలిసింది. అనంతరం సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్‌కు సంబంధించిన ఒక ప్రయివేట్ ప్రోగ్రాంలో సిఎం పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఢిల్లీ పర్యటన ముగించుకొని సిఎం తిరిగి హైదరాబాద్ బయలు దేరనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

యావత్ తెలంగాణ కాంగ్రెస్‌తో ఉందనే సందేశం ఇచ్చారు : పిసిసి చీఫ్

జూబ్లీహిల్స్‌లో భారీ మెజార్టీతో విజయం సాధించటం ద్వారా యావత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీతో ఉందనే సందేశాన్ని ఓటర్లు ఇచ్చారని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రెండేండ్ల ప్రజాపాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజలు తీర్పునిచ్చారన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని చెప్పారు. ఎంఐఎం మద్దతు, డబ్బులతో కాంగ్రెస్ గెలిచిందన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బిజెపికి డిపాజిట్ కూడా రాలేదని, ఆ పార్టీ నేతగా కిషన్‌రెడ్డి ఏం మాట్లాడినా ప్రజలు ఆదరించరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై క్యాబినెట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి కమిట్‌మెంట్ ఉందని మరోసారి గుర్తు చేశారు. బలహీన వర్గాలకు ఈ రిజర్వేషన్లు అందకుండ బిజెపి అడ్డంకులు సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా తనను మంత్రివర్గంలోకి తీసుకుంటారంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదన్నారు. ఆ జాబితాలో తన పేరు లేదని పేర్కొన్నారు.

బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడి అవాస్తవం : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రజా సేవ చేసేందుకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఢిల్లీ వచ్చినట్టు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపొందిన నవీన్ యాదవ్ చెప్పారు. "నియోజక వర్గ ప్రజలు భారీ మెజార్టీతో నన్ను ఆశీర్వదించారు. వారందరికీ రుణపడి ఉంటా. కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు చెప్పడానికి ఢిల్లీ వచ్చాను. సిఎం, డిప్యూటీ సిఎం, పిసిసి చీఫ్‌లతో కలిసి కాంగ్రెస్ అగ్రనేతల నుంచి ఆశీర్వాదం తీసుకున్నా.." అని ఆయన తెలిపారు. అయితే బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేసినట్టు కెటిఆర్ చేస్తోన్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు.

20 నుంచి "కనెక్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్"

- తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం
- గవర్నర్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవంబర్ 20 నుంచి 27 వరకు రెండు విడుతల్లో తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల "కనెక్ట్ టెక్నో-కల్చరల్ ఫెస్టివల్"ను నిర్వహిస్తున్నట్టు గవర్నర్ ముఖ్య కార్యదర్శి ఎం దానకిషోర్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 నుంచి 22 వరకు మొదటి విడుత ప్రారంభ సమావేశం మూడు రోజుల పాటు హైటెక్స్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, ఈశాన్య రాష్ట్రాల మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. రెండవ విడుత ఈ నెల 25 నుంచి 27 వరకు రాజ్‌భవన్‌లో ప్రారంభమవుతుందని తెలిపారు. సిక్కింతో సహా ఏడు రాష్ట్రాలు పాల్గొనే ఈ ఫెస్టివల్‌లో సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు.

గవర్నర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

"గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్-2025" అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గవర్నర్ ముఖ్య కార్యదర్శి ఎం దానకిషోర్ తెలిపారు. మహిళా సాధికారిత, గిరిజన అభివృద్ధి, రూరల్ హెల్త్, కార్పొరేట్ వాలంటరీ రంగాల్లో గడిచిన ఐదేళ్లలో విశిష్ట సేవలందించిన వారు ఈ అవార్డులకు అర్హులని వివరించారు. ఒక్కో రంగంలో రెండు కేటగిరీల్లో (వ్యక్తులు, సంస్థలు) అవార్డులను ఎంపిక చేయనున్నట్టు ప్రకటించారు. అవార్డు కింద రూ.రెండు లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. అర్హులైన వ్యక్తులు, సంస్థలు డిసెంబర్ ఐదులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఎంపికయిన విజేతలకు 2026 జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానం చేయనున్నట్టు తెలిపారు.

ఐఐటిఎఫ్‌లో తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మక ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటిఎఫ్) న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో శుక్రవారం మొదలయింది. దీనిలో తెలంగాణకు చెందిన పెవిలియన్ ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయెల్ నేడు తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ 2025లో రాష్ట్ర పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక శాఖ ఆధ్వర్యంలో పలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని నల్లగొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, జనగామ, వరంగల్ అర్బన్, నారాయణపేట్ జిల్లాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేతి వృత్తులకు సంబంధించిన వస్తువులు, చేనేత వస్త్రాలు, గిరిజన ఆభరణాలు, చేతితో తయారు చేసిన గాజులు, హెర్బల్, మెడికల్ ఉత్పత్తులు, పోచంపల్లి వస్త్రాలు, ఫ్యూజన్ బ్యాగులను ఈ స్టాళ్లలో ప్రదర్శించారు. ఈ ట్రేడ్ ఫెయిర్ రెండు వారాలు కొనసాగనుంది. మన దేశ ఐక్యత, వైవిధ్యం, జాతీయ పురోగతిని సూచిస్తూ జరుపుకునే "ఏక్ భారత్ - శ్రేష్ట భారత్" అనే ఇతివృత్తాన్ని ఈ 44వ ఎడిషన్ హైలైట్ చేస్తున్నదని శనివారం పౌరసంబంధాల అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు.

చేయి చేయి కలుపుతాం... అవినీతిని అరికడతాం

- హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ జీరో టాలెరెన్స్ విధానానికి అనుగుణంగా విధులను నిర్వహించాలన్న సంకల్పంతో హౌసింగ్ కార్పొరేషన్‌లో పలు వినూతనమైన కార్యక్రమాలను చేపట్టారు. అవినీతి, లంచం అనేవి లేకుండా పూర్తి పారదర్శకంగా గృహ నిర్మాణ పథకాల లబ్ధి చేకూరుంతుందనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో శనివారం హైదరాబాద్‌లోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం నేతత్వంలో ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలనుంచి వచ్చిన ప్రాజెక్టు డైరక్టర్లు, మేనేజర్లు అసిస్టెంట్ మేనేజర్లు తదితర స్థాయిల్లోని అధికారులతో పాటు, ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది అందరూ అవినీతికి వ్యతిరేకంగా హైదరబాద్‌లోని లిబర్టీ సమీపంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతికి వ్యతిరేకంగా చేపడుతున్న కాల్ సెంటర్ , హెల్ప్ డెస్క్ తదితర వివరాలతో కూడిన కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఈశ్వరయ్య, శ్రీ చైతన్య కుమార్, భాస్కర రెడ్డి, విజయకుమార్, మమత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హోమ్‌స్టేల ఏర్పాటుకు పర్యాటక శాఖ దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యాటకరంగ అభివృద్ధికిగాను, గ్రామీణ ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, జిల్లా కేంద్రాల్లో హోమ్ స్టేల ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్న ప్రయివేటు పెట్టుబడిదారులు, వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శనివారం పర్యాటక ప్రకటించింది. దరఖాస్తులు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఉన్న పర్యాటక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపింది. పూర్తిచేసిన దరఖాస్తులను 'డైరెక్టర్, పర్యాటక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, కళాభవన్, రవీంద్రభారతి, సైఫాబాద్, హైదరాబాద్-500004'కు పంపించాలని సూచించింది. వివరాలకు 040-23459282 నంబరులో సంప్రదించాలని పేర్కొంది. ప్రస్తుతం పనిచేస్తున్న హోమ్‌స్టే గదులను 'తెలంగాణ టూరిజం హోమ్‌స్టే ఎస్టాబ్లిష్‌మెంట్స్'గా వర్గీకరించి, సిల్వర్ కేటగిరికి రూ. రెండు వేలు, గోల్డ్ కేటగిరీకి రూ.నాలుగు వేలు రుసుముగా పర్యాటక శాఖకు చెల్లించాలని తెలియజేసింది.

లోక్ అదాలత్‌లో 42 వేల కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో 42.063 కేసులు పరిష్కారమయినట్టు లోక్ అదాలత్ మెంబర్ సెక్రటరీ సిహెచ్, పంచాక్షరి ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో కింది స్థాయి నుంచి హైకోర్టు వరకు అన్ని కోర్టులు కేసుల పరిష్కారానికి కృషి చేశాయని తెలిపారు.

నృత్యం ద్వారా సామాజిక భావాలను ప్రజలకు చేరవేయాలి

- ఆట, పాటలు సామాజిక ఆయుధాలు
- కొవిదా ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు పి అనూహ్యారెడ్డి
- ఎస్‌వికెలో ఇండియన్ డాన్స్ హెరిటేజ్ ఫెస్టివల్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నృత్యం ద్వారా సామాజిక ప్రయోజనంతో కూడిన భావాలను ప్రజలకు చేరవేయాలని కొవిదా ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు పి అనూహ్యారెడ్డి అన్నారు. ఆట, పాటలు రెండూ సామాజిక ఆయుధాలేనన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చినుకు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో శనివారం టిపిఎస్‌కె అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, చినుకు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు పిఎన్ మూర్తి అధ్యక్షతన ఇండియన్ డాన్స్ హెరిటేజ్ ఫెస్టివల్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ శాస్త్రీయ నృత్యాలు చూసి ఆనందించడం కోసం కాదని, సామాజిక ప్రయోజనంతో కూడిన భావాన్ని ప్రజలకు అర్థం చేయించగలగాలని అన్నారు. శాస్త్రీయ నృత్యాలు సామాన్యులకు చేరువ చేయడమే సాంస్కృతిక లక్ష్యంగా ఉండాలన్నారు. టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ.. భరతనాట్యం, కూచిపూడి, మోహిని ఆటం, కథక్, కథాకళి లాంటి నృత్యాలను మన దేశానికే పరిమితం చేయకుండా విదేశాల్లోనూ ప్రదర్శించాలని సూచించారు. విదేశాల్లో ఉన్న ఆర్ట్ ఫామ్స్‌ను కూడా మనం వీక్షించాలని, ఇది ఒక నిరంతర ప్రక్రియగా ఉండాలన్నారు. ప్రతి నృత్యాన్నీ నిరంతరం ఆధునీకరించడం ఒక అలవాటుగా మారాలన్నారు. వివిధ ప్రదేశాల్లో నృత్య ప్రదర్శనలు చేస్తే ఒక ఆత్మవిశ్వాసం, పరిపక్వత ఉన్నతి పెరుగుతుందని చెప్పారు. పిఎన్ మూర్తి మాట్లాడుతూ.. భరతనాట్యం, కూచిపూడి లాంటి నృత్యాలను అర్బన్ స్ట్రీట్ స్టైల్‌లోకి కూడా తీసుకురావాలని, ప్రజాపాటలకు నృత్య నిరాజనం లాంటి ప్రదర్శనలు విరివిగా ఇవ్వాలని కోరారు. మహనీయుల జీవిత చరిత్రలను నృత్య రూపకాలుగా తయారు చేసినప్పుడే ప్రజలు కళలను, కళాకారులను గుర్తుంచుకుంటారని, ప్రోత్సహిస్తారని అన్నారు. పిల్లల్లో అసమాన ప్రతిభ పాటవాలు ఉన్నాయని, వారి ప్రతిభను, సృజనను వెలికి తీయడం కోసం అనేక వేదికల అవసరమన్నారు. ఇండియన్ క్లాసికల్ అండ్ ఫోక్ నృత్యాలకు దేశవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉందని, వాటిని ప్రభుత్వాలు కూడా నిరంతరం ప్రోత్సహించాలని కోరారు. నృత్యాలు ప్రదర్శించిన పిల్లలందరికీ సర్టిఫికెట్ మెమోంటోలిచ్చి అభినందించారు. నృత్య గురువులకు గురువందనం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్ శ్రీరామ్, దత్తు, డా. పి జానకి దేవి, ఆచార్య ఘంటసాల పవన్ కుమార్, ఆచార్య చినుకు కోర్ గ్రూప్ జి లావణ్య, కె రామలక్ష్మి, డి రాధిక, శ్రీనివాస్, కె స్వర్ణలత, ఎ అనుదీప్తి, సిహెచ్ వీరభద్రరావు, అరుణ, శ్రీనివాస్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

20 నుంచి హైదరాబాద్‌లో ఇండియన్ ఫొటో ఫెస్టివల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఫొటో ఫెస్టివల్ (ఐపిఎఫ్) 11వ ఎడిషన్ ఈనెల 20 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరగనుంది. ఫొటో జర్నలిజం నుంచి లలిత కళల వరకు, డాక్యుమెంటరీ నుంచి ల్యాండ్‌స్కేప్ వరకు కేవలం ఒక్క భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అద్భుత ఫొటో, డాక్యుమెంటరీ, దృశ్యాలను ఈ ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించే ఐపిఎఫ్ ఎడిషన్‌లో సోలో ఎగ్జిబిషన్లు, గ్రూప్ షోకేస్‌లు, ఆర్టిస్ట్ టాక్‌లు, వర్క్‌షాప్‌లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ స్క్రీనింగ్‌లు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫొటో ఫెస్టివల్ ఎడిషన్ కోసం ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల నుంచి 820 ఎంట్రీలు వచ్చాయని వివరించారు. వాటిని నిష్ణాతులైన జ్యూరీ సభ్యులు - నికోల్ తుంగ్ (ఫొటో జర్నలిస్ట్), గురిందర్ ఒసాన్ (ఫొటో ఎడిటర్, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా), సుకృతి అనా స్టానెలీ (క్రియేటివ్ డైరెక్టర్, ది కారవాన్), మాధవన్ పిళ్లై (ఫొటోగ్రాఫర్, క్యూరేటర్) ఫైనలిస్టులను ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే ప్రధాన ఫొటో ఎగ్జిబిషన్లలో శాశ్వత ముసుగులు-అలెశాంద్రో సెలాంటే (బ్రెజిల్), రెయిన్ డాగ్స్-రోహిత్ చావ్లా (భారతదేశం), బెటర్ డేస్-సెంగు కిమ్ (దక్షిణ కొరియా): "స్లో ఫొటోగ్రఫీ, ముర్కీ వాటర్స్-ది కారవాన్, ఎం పళని కుమార్ (భారతదేశం), సూడాన్: యుద్ధ సమయంలో గైల్స్ క్లార్క్ (యూకే), సూడాన్ లింగరింగ్ షాడోస్-నజానిన్ అలిపూర్ జెడ్డీ (ఇరాన్), స్లాష్ అండ్ బర్న్-గ్లోరియానా జిమెండాజ్ (కోస్టా రికా), ఫ్రంట్‌లైన్స్ ఆఫ్ డిగ్నిటీ, ష్రెడెడ్ స్కైస్, ఇతర ప్రేమ కథలు-మేరీలిస్ విగ్నేయు (ఫ్రాన్స్), నో మ్యాన్స్ ల్యాండ్-ఎల్కే స్కోలియర్స్ (బెల్జియం), టాబూతో వంట-హృదయ సదానంద్ (భారతదేశం) లచే ప్రదర్శనలను ఏర్పాటు చేశామని వివరించారు. జెన్నిఫర్ ఆల్ఫోన్స్ దర్శకత్వం వహించిన నాగోబా జాతరతోపాటు అనేక అంశాలపై డాక్యుమెంటరీల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈనెల 20న సాయంత్రం 5.30 గంటలకు స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఐపిఎఫ్-2025 ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు www.indianphotofest.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

పత్తి జిన్నింగ్ మిల్లుల సమస్యలను పరిష్కరించండి

- మంత్రి తుమ్మలకు తెలంగాణ పత్తి రైతుసంఘం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి జిన్నింగ్ మిల్లుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పత్తి రైతుసంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అన్ని మిల్లులకూ జిన్నింగ్‌కు అవకాశం కల్పించాలనీ, జిన్నింగ్ దూది దిగుబడిని నెలకోసారి నిర్ణయించాలని కోరింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలంగాణ పత్తి రైతు సంఘం కన్వీనర్ భూక్యా చందు నాయక్, కోకన్వీనర్ మూడ్ శోభన్ నాయక్ శనివారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ముడి పత్తిని ఇచ్చి, వారి నుంచి దూదిని సేకరిస్తుందని తెలిపారు. ఒక బేలు (170 కిలోల దూది) జిన్నింగ్ చేసినందుకు రూ.1,400 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. కనీసం 600 కిలోల పత్తి జిన్నింగ్ చేయడం ద్వారా ఒక బేలు వస్తుందని వివరించారు. సీసీఐ రూ.1,400 బేలుకు చెల్లిస్తే, జిన్నింగ్ మిల్లులు రైతుల నుంచి దిగుమతి, లోడింగ్, దూదిలో తరుగుదల ఏర్పడితే జిన్నింగ్ మిల్లులు భరించాలని తెలిపారు. ఈ ఖర్చులన్నీ జిన్నింగ్ మిల్లులు భరిస్తున్నాయని పేర్కొన్నారు. చాలా ఏండ్ల నుంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జిన్నింగ్ చార్జీలను పెంచలేదని తెలిపారు. దూది దిగుబడిని గతంలో నెలకోసారి నిర్ణయించగా, ప్రస్తుతం 15 రోజులకు నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు.

సిసిఐ అన్ని మిల్లులకూ జిన్నింగ్‌కు అవకాశం ఇవ్వకుండా కొన్ని మిల్లులనే ఎంపిక చేసిందని వారు తెలిపారు. చాలా మిల్లులు పని లేకుండా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో అన్ని మిల్లులకు స్థాయిని బట్టి జిన్నింగ్ చేయించారని గుర్తు చేశారు. కానీ ఈ ఏడాది కొన్ని మిల్లులకు జిన్నింగ్‌కు ఇవ్వకపోవడం వల్ల వారు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. జిన్నింగ్ చేసే మిల్లులు కూడా వారితో కలిసి ఆందోళనకు సిద్ధమౌతున్నాయని పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులను బట్టి జిన్నింగ్ విధానాన్ని కూడా సరి చేయాలని సూచించారు. ఇప్పటికే దాదాపు ఎనిమిది లక్షల బేల్ల దూది జిన్నింగ్ చేయాల్సి ఉండగా, కేవలం రెండు లక్షల బేల్లు మాత్రమే జిన్నింగ్ చేసినట్టు తెలుస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎకరాకు ఏడు క్వింటాళ్లే కొనుగోలు చేయాలంటూ పరిమితి పెట్టడం వల్ల రైతులు నష్టపోవడమే కాక జిన్నింగ్ మిల్లులు కూడా తగినంత పని లేకుండా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.కోట్ల పెట్టుబడి పెట్టిన జిన్నింగ్ మిల్లులు ఏడాదిలో నాలుగు నెలలే పని ఉంటుందనీ, మిగిలిన కాలం అవి మూతపడుతాయని వివరించారు. జిన్నింగ్ మిల్లులకు నష్టం కలగకుండా ప్రస్తుత సీసీఐ విధానాలను సవరించాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలుపై ఆంక్షలను ఎత్తేయాలని కోరారు. రద్దు చేసిన దిగుమతి సుంకాలను పునరుద్దరించి దేశీయ పత్తికి మార్కెటింగ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. భారత్‌లో అవసరాలకు మించి పత్తి ఉత్పత్తి జరుగుతున్నదని తెలిపారు. తెలంగాణ జిల్లాల్లో పత్తి రెండో పంటగా సుమారు 50 లక్షల ఎకరాల్లో 22 లక్షల మంది రైతులు పండిస్తున్నారని వివరించారు. వారికి తగినన్ని జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని పేర్కొన్నారు. సీసీఐ రైతులకు జిన్నింగ్ మిల్లులకు నష్టం జరగకుండా సమిష్టి చర్చలు జరిపి విధానాన్ని రూపొందించాలని కోరారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వారు విజ్ఞప్తి చేశారు.

కెజిబివి వర్కర్లకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలి : టియుసిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెజివిబి అకౌంటెంట్లకు, వర్కర్స్, కుక్, అటెండర్, స్వీపర్లకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలని టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రగతిశీల కెజిబివి నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ నికోలస్, రాధా రెడ్డి , జాయింట్ డైరెక్టర్ వెంకట నర్సమ్మ వినతి పత్రాన్ని అందజేశారు. నాన్ టీచింగ్ సిబ్బందికి నైట్ డ్యూటీలను వేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పని భారాన్ని తగ్గించాలనీ, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల నుండి జీతం పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. జీతాలు ఎక్కువ ఉన్న టీచింగ్‌కి నైట్ డ్యూటీలు తగ్గించి, జీతాలు తక్కువ ఉన్న అకౌంటెంట్లు, వర్కర్లకు నైట్ డ్యూటీ పనుల్ని పెంచడం వివక్షేనని పేర్కొన్నారు. నైట్ డ్యూటీలను వేస్తూ తీసుకొచ్చిన సర్క్యులర్లన్నింటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని, హాస్టల్ వార్డెన్స్ నియామకం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన నాయకులతో పాటు ప్రొగ్రెసివ్ కెజిబివి నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎల్ పద్మ, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వీరమణి ,శోభ, మాధవి, పారిజాత, లత, రమ , శారద, లావణ్య, షబానా, భారతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా "సర్" అమలుకు చర్యలు

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో త్వరలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (సర్) అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్ నుంచి సర్ కార్యక్రమం పురోగతి, పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత అంశాలపై ఇఆర్‌ఓలు, ఎఆర్‌ఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్ జాబితా నవీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, క్షేత్రస్థాయి గుర్తింపు, డేటా ఎంట్రీ, తదితర అంశాలపై సిఇఒకు ఈ సందర్భంగా అధికారులు నివేదికలు సమర్పించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, ఓటర్ జాబితా నాణ్యతను మరింత మెరుగుపర్చే దిశగా పనిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డిప్యూటీ సిఇఒ హరి సింగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక వైద్య శస్త్రచికిత్సలపై అవగాహన అవసరం

- నిమ్స్ డైరెక్టర్ బీరప్ప
- ఎమర్జెన్సీ భవనంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యూరో-స్పైనల్ శస్త్రచికిత్స రంగంలో ఆధునిక సాంకేతిక పద్ధతులపై వైద్యులకు అవగాహన ఉండటం అత్యంత కీలకమని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. నిమ్స్, అసోసియేషన్ ఫర్ న్యూరో-స్పైనల్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సంయుక్తంగా శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఎమర్జెన్సీ భవనంలోని ట్రామా ఆడిటోరియంలో "యూనిలాటరల్ బయో పోర్టల్ స్పైనల్ ఎండోస్కోపీకోర్స్-క్యాడేవరిక్ వర్క్‌షాప్ అండ్ సర్జికల్ ప్రిసెప్టర్‌షిప్" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నిమ్స్ సర్జన్ డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షత వహించగా డైరెక్టర్ బీరప్ప జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు. నేడు వైద్యరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా న్యూరో-స్పైనల్ సర్జరీలో నూతన సాంకేతికతలను పరిచయం చేసి వైద్యులకు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు.

అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆధునిక మినిమల్లీ ఇన్వేసివ్ వెన్నెముక శస్త్రచికిత్సలో ఉపయోగించే బైపోర్టల్ టెక్నిక్ ద్వారా కేవలం రెండు చిన్న రంధ్రాల ద్వారా ఆపరేషన్ చేయడం వల్ల రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం ఉంటుందన్నారు. వేగంగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. క్యాడేవరిక్ వర్క్‌షాప్‌లో వైద్యులు స్వయంగా మృతదేహాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందినట్టు చెప్పారు. దీని ద్వారా వెన్నెముక నిర్మాణం, నరాల వ్యవస్థ, శస్త్రచికిత్స పద్ధతులపై లోతైన అవగాహన లభించినట్టు తెలిపారు. సర్జికల్ ప్రిసెప్టర్‌షిప్ సెషన్‌లో అనుభవజ్ఞులైన నిపుణులు లైవ్ సర్జరీ ప్రదర్శనలు చేసి, పార్టిసిపెంట్లకు మార్గదర్శకత్వం అందించారు. దీని ద్వారా వైద్యులు తాజా శస్త్రచికిత్స పద్ధతులను ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం లభించింది. ఈ శిక్షణ కార్యక్రమం వైద్యుల నైపుణ్యాలను పెంపొందించి, రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.సుచంద భట్టాచార్య, డా.వంశీకృష్ణ యెర్రమేని, డా. డి.రాజారెడ్డి, న్యూరో సర్జరీ వైద్యులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ పేరు వాడితే చర్యలు

- సోమయ్య నాన్‌వర్కింగ్ జర్నలిస్ట్
- సంఘాన్ని నడిపే అర్హత లేదు : టిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) పేర శనివారం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో సమావేశం ఏర్పాటు చేసి వర్కింగ్ జర్నలిస్టులను మోసం చేసిన మామిడి సోమయ్య చర్యలను టిడబ్ల్యుజెఎఫ్ మహాసభ అడ్ హాక్ కమిటీ కన్వీనర్, సీనియర్ ఉపాధ్యక్షులు పి రాంచందర్, ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య ఖండించారు. నాన్ వర్కింగ్ జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్టుల పేర సమావేశం పెట్టడాన్ని తప్పుబట్టారు. ఫెడరేషన్ పేరు వాడితే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దొంగ సభ్యత్వం చేయడం, సభ్యత్వ రుసుం సొంత అవసరాలకు వాడుకోవడం, లెక్కలు చెప్పమంటే సంఘాన్ని చీల్చేందుకు ప్రయత్నించడాన్ని ఖండించారు. దొంగే.. దొంగా దొంగా ఉన్నట్టుగా సోమయ్య వ్యవహారం ఉందని వ్యాఖ్యానించారు. అసలైన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 12న, విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 13న హైదరాబాద్లో ఇప్పటికే జరిగాయని అన్నారు. ఇందులో వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య, పులిపల్పుల ఆనందం, బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితూడి బాపూరావు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేస్తూ రాష్ట్రవిస్తత సమావేశం వారిని శాశ్వతంగా బహిష్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.. వీరంతా నాన్‌వర్కింగ్ జర్నలిస్టులని అభిప్రాయపడ్డారు. ఫెడరేషన్ పేరు వాడుకుంటే పోలీసు కేసుతోపాటు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్య కోటాలో ఉండే వీరంతా కలం కార్మికులు కాదని, జర్నలిస్టులు కానీ వాళ్లకు జర్నలిస్టు సంఘం పేర నీతులు ,చెప్పడం విడ్డూరంగా ఉందని అభిప్రాయపడ్డారు. మరోసారి ఫెడరేషన్ పేరు వాడితే సివిల్, క్రిమినల్ చర్యలకు మెనుకాడబోమని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాకేశ్ క్రిస్టోఫర్‌పై దాడికి మేడే రాజీవ్‌సాగర్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత క్రైస్తవ నాయకులు, జూబ్లిహిల్స్ క్రిస్టియన్ ఫోరం ఉపాధ్యక్షులు రాకేశ్ క్రిస్టోఫర్‌పై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా అణగారిన వర్గాలపై పెత్తనం చూపే కాంగ్రెస్ నిజ స్వరూపం ఈ ఘటన ద్వారా మరోసారి బయటపడిందని తెలిపారు. దళిత క్రైస్తవులపై దాడులు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన దళిత క్రైస్తవ నేతలు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. రాకేశ్ క్రిస్టోఫర్‌పై దాడి చేసిన గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు.

డయాబెటిక్ రెటినోపతిపై డాక్టర్ అగర్వాల్స్ క్యాంపెయిన్

హైదరాబాద్ : ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి 'డయాబెటిక్ రెటినోపతి పేషెంట్ సమ్మిట్'ను పంజగుట్ట, గచ్చిబౌలి కేంద్రాలలో నిర్వహించింది. డయాబెటిస్ ఉన్నవారికి ఉచిత కంటి సంప్రదింపుల ఆఫర్‌ను నవంబర్ 30 వరకు పొడిగించినట్లు డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్స్ రీజినల్ హెడ్ డాక్టర్ ప్రీతీ తెలిపారు. ఈ సమయంలో అన్ని ఇతర రోగులకు కన్సల్టేషన్ ఫీజుపై 50 శాతం తగ్గింపును ఇస్తోన్నట్లు పేర్కొన్నారు. దేశంలో సుమారు 30 లక్షల మంది డయాబెటిస్ రోగులు డయాబెటిక్ రెటినోపతితో బాధపడుతున్నట్లు అంచనా.

మధుమేహంతో అప్రమత్తం

- జయంతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎమ్‌డి శరత్ చంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్

మధుమేహంతో జాగ్రత్తగా ఉండాలని జయంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ కె శరత్ చంద్ర తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ నగర్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం (డయాబెటీస్) కేసులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. దీని వల్ల గుండె, మెదడు, మూత్రపిండాలు వంటి అవయవాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. ఈ రోజు ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ చార్లెస్ బాంటింగ్ జన్మదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పాటించబడుతుందన్నారు. దేశంలో ప్రస్తుతం సుమారు పది కోట్ల మంది పెద్ద వారిలో ఈ వ్యాధి ఉన్నట్లు అంచనా అన్నారు.

చేపల స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం

- చెరువుల వద్ద సైన్ బోర్డులు : మంత్రి వాకిటి శ్రీహరి
- హుస్నాబాద్ అభివృద్ధికి కృషి : మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్లమ్మ చెరువులో మూడు లక్షల చేప పిల్లలు విడుదల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హుస్నాబాద్‌లో మత్స్య సంపద అభివృద్ధి చెందేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చేపల మార్కెట్‌లో స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మత్స్య, పశుసంవర్ధక శాఖమంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువులో రూ.5.17 లక్షల విలువ చేసే మూడు లక్షల చేపపిల్లలను మంత్రి పొన్నంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత చేపపిల్లల పంపిణీ ద్వారా ఎల్లమ్మ చెరువులో విడుదల చేసిన చేపపిల్లలతో 253 మంది మత్స్యకారుల కుటుంబాలకు లబ్ది చేకూరనుందన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 165 చెరువుల్లో 38.92 లక్షల ఉచిత చేపపిల్లలను విడుదల చేయనున్నామని, దీంతో 4,144 మంది మత్స్యకారుల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్య శాఖ కీలకంగా మారేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు 3 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ అందించామని తెలిపారు. అంతేకాకుండా మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా రూ.5లక్షల బీమా ద్వారా బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తున్నట్టు తెలిపారు. మత్స్యశాఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.123 కోట్లు కేటాయించారనీ, అందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈ బడ్జెట్‌లో 84 కోట్ల చేపపిల్లలు, పది కోట్ల రొయ్య పిల్లలు, రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామన్నారు. గతంలో చేపపిల్లల పంపిణీలో అవకతవకలు జరిగాయని, ఈసారి అంతా పారదర్శకంగానే జరుగుతోందని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గురుకులాల్లో మటన్, చికెన్ లాగా చేపలు కూడా మెనూ ఉండాలని ఇటీవల మంత్రి వాకిటి శ్రీహరి లేవనెత్తిన అంశాలపై చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్‌లో టూరిజంను అభివృద్ధి చేస్తున్నామని, ఇక్కడికి వచ్చే వారు చేపలు కొనేలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఈ ప్రాంతంలో అధునాతన వెటర్నరీ హాస్పిటల్ నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న మోడ్రన్ చేపల మార్కెట్‌ను పూర్తిచేయాలని, వెటర్నరీ డాక్టర్ పోస్టు మంజూరు చేయాలని, గోపాల మిత్ర సమస్యలు పరిష్కరించాలని మంత్రి వాకిటి శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి శ్రీహరి.. హుస్నాబాద్ పశువైద్యశాల ఆధునీకరణ, చేపల మార్కెట్, స్టోరేజ్ సెంటర్, పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. చేపల పంపిణీలో అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రుల మార్గదర్శకత్వంలో పారదర్శకంగా చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మత్స్య సహకార సంఘం నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా నాయకులు బండ శ్రీశైలానికి పితృవియోగం

- రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నివాళులు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నర్సింహ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

నల్లగొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుజ్జ గ్రామానికి చెందిన రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం తండ్రి బండ నర్సింహ(85)శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి.నర్సింహారావు హాజరయ్యారు. నర్సింహ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. శ్రీశైలం కుటుంబానికి సానుభూతి తెలిపారు.ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పాలడుగు నాగార్జున, చినపాక లక్ష్మీనారాయణ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ రిపోర్టు బహిర్గత పరచాలి : ఏఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒయు సీనియర్ ప్రొఫెసర్ అక్రమాలపై నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ రిపోర్టుని బహిర్గత పరచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టా రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కొంతమంది ప్రొఫెసర్లకు ప్రమోషన్లలో జరిగిన అన్యాయంపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉస్మానియా యూనివర్సిటీలో గత విసి హాయంలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో అనేక కార్యక్రమాలు జరిగాయనీ, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారికి ప్రమోషన్లు ఇచ్చారని తెలిపారు. ఆ క్రమంలో ఒయులో జరిగిన అనేక ఆందోళనల కారణంగా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి కౌన్సిల్ విశ్రాంత ప్రొఫెసర్ తిరుపతిరావును చైర్మెన్‌గా కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఆ కమిటీ రిపోర్టు సమర్పించినా ఇప్పటివరకు దానిని బహిర్గతం చేయలేదని, తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దశలవారిగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఓయూ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య. నాయకులు అశ్విన్ ఉన్నారు.



సిఐటియు మహాసభకు.. 'నవతెలంగాణ' మెదక్ జిల్లా విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మెదక్ పట్టణంలో నిర్వహించనున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు మెదక్ జిల్లా నవతెలంగాణ విలేకరులు తమ వంతు విరాళంగా సుమారు రూ.14,000 అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నవతెలంగాణ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ మల్లేశంకు విలేకరులు అందించిన ఆర్థిక సహాయాన్ని రీజినల్ మేనేజర్ రేవంత్ కుమార్, ఉమ్మడి జిల్లా ప్రాంతీయ ప్రతినిధి దండు ప్రభు, డెస్క్ ఇన్‌చార్జి దస్తగిరి అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. సిఐటియు కార్మికులు, ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. నవతెలంగాణ విలేకరులు ప్రజాపోరాటాలకు అండగా నిలవడం హర్షణీయమన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మహాసభ జయప్రదానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎడివిటి ఇన్‌చార్జి మల్లేశం, నర్సాపూర్ ఎడివిటి ఇన్‌చార్జి మహిపాల్, రికవరీ ఇన్‌చార్జి నారాయణ, విలేకరులు జె శ్రీనివాస్, బి మల్లేశం, సాయికృష్ణ, సత్యనారాయణ, చిన్న సాయిలు, ఆర్ శ్రీనివాస్, చెంద్రయ్య, డి మురళీ, సలీం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపునకు నోచుకోని తొలి స్త్రీ వాద రచయిత్రి లత

- సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు

ప్రజాశక్తి - కల్చరల్



స్త్రీ వాదం తెలుగు సాహిత్యంలో మొదలు కాని రోజుల్లోనే ప్రచారంకి నోచుకుని తొలి స్త్రీ వాద రచయిత్రి తెన్నేటి హేమలత అని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో మహా రచయిత్రిగా తెన్నేటి లత 90వ జయంతి సందర్భంగా సాహితీ పరిశోధకులు డాక్టర్ టివి నాగ రంజనికి పురస్కారం ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నరసింహా రెడ్డి పురస్కారం బహుకరించి మాట్లాడారు. సంప్రదాయ విధానాలు అతిక్రమించి కుండా మితిమీరిన స్వేచ్ఛను వ్యతిరేకించిన లత ఆ రోజులో వేశ్యలు గురించి నవల రాసి సంచలనం సృష్టించిన స్త్రీ వాద రచయిత్రి అని కొనియాడారు. పురస్కారం అందుకున్న నాగ రంజని తెలుగు నావలా రచయిత్రులుపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారని అభినందించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ తన రచనలతో వ్యక్తిత్వంతో ధిక్కార స్వరం లత నేటికి నిలిచి ఉంటారని చెప్పారు. వైవిధ్య ప్రక్రియలో అసమాన ప్రతిభతో రచన చేసారని వివరించారు. వంశీ సంస్థ తమ కార్యక్రమంలో ఒక పుస్తకం కోని పంచడం విశేషమన్నారు. వంశీ రామ రాజు మాట్లాడుతూ లత రాసిన మోహన వంశీ నవలలోని వంశీ తమ సంస్థ పేరు పెట్టుకున్నామని చెప్పారు. ప్రతి సంవత్సరం లత పేరిట లక్ష రూపాయలు ఉత్తమ రచయిత్రికి ప్రదానం చేస్తామని ప్రకటించారు. వేదికపై ఉగాండాకు చెందిన బి వ్యాస కృష్ణ, హాంగ్ కాంగ్‌కు చెందిన జయ, డాక్టర్ తెన్నేటి సుధ పాల్గొన్నారు. సుంకరపల్లి శైలజ సుధామయి కార్యక్రమ నిర్వహణ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో వికటించిన ఇంజక్షన్

- 17 మంది చిన్నారులకు అస్వస్థత
- సకాలంలో చికిత్స.. నిలకడగా పిల్లల ఆరోగ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు అప్రమత్తమై వైద్యం అందించడంతో వారు వెంటనే కోలుకున్నారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నాగార్జునా సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలతో మూడేళ్ల నుంచి పదేళ్లలోపు చిన్నారులు చికిత్స తీసుకుంటున్నారు. వారితో పాటు స్థానికంగా ఉండే చిన్నారులు సైతం శుక్రవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు. వారందరికీ యాంటీబయాటిక్ ఇంజక్షన్లు (మోనోసేఫ్) వైద్యులు ఇచ్చారు. ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న చిన్నారులు చలిజ్వరం, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారితో ఇంజక్షన్ తీసుకున్న స్థానికంగా ఉండే పిల్లలు కూడా అస్వస్థతకు గురవ్వడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. విషయం తెలిసిన సూపరింటెండెంట్ భానుప్రసాద్ వైద్యులను, సిబ్బందిని అప్రమత్తం చేసి చికిత్స ప్రారంభించారు. ఇంజక్షన్ తీసుకున్న మిగతావారికి సైతం సిబ్బంది ఫోన్ చేసి పిలిపించి చికిత్స అందించారు. శనివారం ఉదయం వరకు పిల్లల ఆరోగ్యం సాధారణ స్థితికి చేరింది. ఒక ఇంజక్షన్‌కు బదులు మరో ఇంజక్షన్ ఇవ్వడంతోనే ఘటన చోటుచేసుకుందని తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్ శనివారం డిసిహెచ్ డాక్టర్ మాత్రునాయక్‌తో కలిసి ఆస్పత్రిలోని పిల్లలను పరిశీలించారు. తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నారాయణఅమిత్ మాట్లాడుతూ.. జ్వరంతో బాధపడుతున్న పిల్లలకు సాధారణంగా ఇచ్చే యాంటీబయాటిక్ ఇంజక్షనే వేశారని తెలిపారు. ఇంజక్షన్ల విషయంలో పిల్లల తల్లిదండ్రుల ఆరోపణలను దృష్టిలో పెట్టుకుని విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడ్రోజుల్లో విచారణ కమిటీ పూర్తి నివేదికను అందజేస్తుందని చెప్పారు. ఆయన వెంట పెద్దవూరు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీదేవి, నందికొండ మున్సిపల్ కమిషనర్ వేణు, ఆస్పత్రి సూపరింటెండెంట్లు హరికృష్ణ, భానుప్రసాద్, సిఐ శ్రీనునాయక్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.

కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి హరీశ్‌రావు అవినీతి

- ఆయన భూముల కోసమే ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు
- ముగ్గురు బిఆర్ఎస్ నాయకుల కోసం 56 మంది రైతులు నష్టపోతున్నారు
- అన్నా.. సోషల్ మీడియాను వీడి బయటకు రా : కవిత



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి హరీశ్‌రావు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మెదక్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జాగృతి జనంబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో పెద్ద పెద్ద నాయకులు ఉండటంతో బీభత్సమైన అభివృద్ధి జరిగి నెక్స్ట్ న్యూయార్క్‌గా మారిందని అనుకున్నానని, కానీ ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని అన్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తే ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని మరి మెదక్ జిల్లాకు హరీశ్‌రావు ఉండగా ఇలా ఎందుకు దాపురించిందని ప్రశ్నించారు. మహానాయకులు ఉన్న చోట అభివృద్ధి ఇలా ఉంటుందా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ ఊహించిన స్థాయిలో పని చేయలేదని, నిజంగా ప్రజల కోసం కష్టపడి ఉంటే ఫలితాలు పూర్తిగా వేరేలా వచ్చేవని అన్నారు. సోషల్ మీడియాలోనే బిఆర్ఎస్ చురుకుగా కనిపించడం తప్పా గ్రౌండ్‌లో ఎలాంటి పని లేదన్నారు. హరీశ్‌రావు, కెటిఆర్.. కృష్ణార్జునుల్లా సోషల్ మీడియాలో మునిగిపోయారని ఆరోపించారు. రామన్నా సోషల్‌మీడియాను వీడి ప్రజల సమస్యలపై పోరాడాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఫలితం చూశాకనైనా బిఆర్ఎస్ సరైన ప్రతిపక్షం పాత్ర పోషించడం లేదని గ్రహించాలని హితవు పలికారు. హరీశ్‌రావు అవినీతి బయటపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హరీశ్‌రావుకు, సిఎంకు మధ్య ఏం ఒప్పందం ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు.

హరీశ్‌రావు 400 ఎకరాల కోసమే ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు..

రెడ్డిపల్లిలో 400 ఎకరాల హరీశ్‌రావు భూముల కోసం ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారని కవిత ఆరోపించారు. రెడ్డిపల్లి, చిప్పలతుర్తి, తునికి గ్రామాల మధ్య హరీశ్‌రావుకు 400 ఎకరాల భూమి, అందులో ఫాంహౌస్ ఉందన్నారు. అదే విధంగా చిన్నచింతకుంటలో గంగుల కమలాకర్‌కు 15ఎకరాలు, నవీన్‌రావుకు 18 ఎకరాల భూమి ఉందని తెలిపారు. వారి భూములు అక్కడ ఉండటంతోనే అలైన్‌మెంట్ మార్చారని, నీటిలో పాముగా రింగులు రింగులుగా మార్చారని ఆరోపించారు. అదే విధంగా నర్సాపూర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి సంబంధించిన భవనంలో నిర్వహిస్తున్న హాస్టల్‌కు అద్దె కింద నెలకు రూ.లక్షా ఆరువేలు తీసుకుంటున్నాడని, అందులో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు.

జాగృతి సంస్థ ప్రశ్నించే శక్తిగా ప్రజల వజ్రాయుధంగా మారుతుందన్నారు. ఆరేండ్లు జాగృతి సంస్థను నడిపానని, 20 ఏండ్లు బీఆర్ఎస్ కోసం పనిచేశానని, పార్టీ పెట్టటం కన్నా కూడా ప్రజల పక్షాన నిలబడటం ముఖ్యమన్నారు. అందులో భాగంగానే జాగృతి జనంబాట కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2014కు ముందు తనకు ఎంత ఆస్తి ఉందో ఇప్పుడు అంతే ఉందని, తనలాంటి ఎంతో మంది ఉద్యమకారులకు అన్యాయం చేశారని ఆరోపించారు. మెడికల్, నర్సింగ్ కాలేజీలకు భవనాలు కట్టించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



సైబర్ క్రైమ్‌పై నగర కేంద్ర గ్రంథాలయంలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కల్చరల్

హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ అధికారులు నిర్వహించారు. సైబర్ క్రైమ్ నేరాలు ఎలా చేస్తారు వారి ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి స్టేషన్ సిఐ, ఎస్ఐలు, ఎసిబి అధికారులు సదస్సులో అవగాహన కల్పించారు. సంస్థ అధ్యక్షులు కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పద్మజ ఎంతో ఉపయుక్తంగా ఉందని అధికారులకు ధన్య వాదాలు తెలిపారు. సుమారు మూడు వందల మంది సదస్సులో పాల్గొని వారి సందేహాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్‌పై జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని డిజిపి, కమిషనర్ ఆదేశాలు అనుసరించి ప్రతి శనివారం విక ప్రాంతం ఎంచుకుని సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారుల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సైబర్ క్రైమ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు

కాంగ్రెస్‌కు బలముంటే అజారుద్దీన్‌కు టికెట్ ఎందుకివ్వలేదు?

- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలముంటే మంత్రి అజారుద్దీన్‌కు టికెట్ ఎందుకివ్వలేదని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి చాలా సర్వేల్లో రేవంత్‌రెడ్డి కంటే నవీన్ యాదవ్‌కు ప్రాబల్యం ఎక్కువ అని తేలిందన్నారు. కానీ రేవంత్‌రెడ్డి గెలిచినట్టు ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. అధికార దుర్వినియోగం వల్లే కాంగ్రెస్ గెలిచిందని చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా బిజెపి నుంచి శ్రీగణేశ్‌ను పట్టుకొచ్చి టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. గద్దర్‌ను వాడుకుని ఆయన బిడ్డకు ఉప ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదన్నారు. గద్దర్ మీద గౌరవం ఉంటే, ప్రజాపాలనపై విశ్వాసం ఉంటే గద్దర్ బిడ్డ వెన్నెలకు టికెట్ ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో కూడా అజారుద్దీన్‌కు టికెట్ ఇవ్వకుండా నవీన్ యాదవ్‌కు టికెట్ ఇచ్చారని అన్నారు. సొంత పార్టీలో ఉన్న వారిని ఖతం చేస్తూ బిజెపి, ఎంఐఎం వారితో రేవంత్‌రెడ్డి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలిచారని, రేవంత్‌రెడ్డి గెలవలేదని చెప్పారు. కాంగ్రెస్ పథకాలు అమలు చేయకపోయినా గెలిచానని సిఎం అనుకుంటే పొరపాటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గౌతం ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేస్తే సహించం

- గర్వంతో విర్రవీగితే కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారు : కెటిఆర్
- బిఆర్ఎస్ కార్యకర్త రాకేశ్ క్రిస్టోఫర్‌కు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వచ్చి 24 గంటలు గడవకముందే బిఆర్ఎస్ కార్యకర్త రాకేశ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ఖండించారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అధికారం, విజయగర్వంతో విర్రవీగితే కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారని అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ పరిధిలోని రెహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బిఆర్ఎస్ కార్యకర్త రాకేశ్ క్రిస్టోఫర్ ఇంటికి వెళ్లి ఆయనతోపాటు కుటుంబ సభ్యులను కెటిఆర్ పరామర్శించారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఫలితాలు వచ్చి 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ రౌడీయిజం, గూండాయిజం మొదలెట్టిందని విమర్శించారు. తాము పదేళ్లు అధికారంలో ఉన్నామని, ఎన్నో ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందామని గుర్తు చేశారు. ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ తరహాలో ప్రతిపక్షాలపై దాడులు చేయలేదన్నారు. తాము అధికారంలో ఉన్నపుడు దాడులు చేసి ఉంటే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచించుకోవాలని చెప్పారు. బిఆర్ఎస్‌కు సంబంధించిన ప్రతి కార్యకర్తనూ కంటికిరెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఆపదొస్తే అన్ని వేళల్లో పార్టీ అండగా ఉంటుందని వివరించారు. తమ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత వహించాలని చెప్పారు. దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమకు గతంలో 80 వేలు ఓట్లు వస్తే ఈ ఉప ఎన్నికల్లో 75 వేల ఓట్లు వచ్చాయని వివరించారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు, రిగ్గింగ్ చేసినా తమ ఓట్లు కేవలం ఐదు వేలు మాత్రమే తగ్గాయన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను అహంకారం తగ్గించుకోవాలన్న సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కెటిఆర్ స్పందిస్తూ శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ చేసిన విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేలిపోయిందని అన్నారు. గతంలో తాము అనేక ఉప ఎన్నికలు గెలిచామని, కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రాలేదని చెప్పారు. కాంగ్రెస్ గుర్తును గాడిద మీద వేసి ఊరేగించామా? అని ప్రశ్నించారు. ఒక్క ఉప ఎన్నికల్లో గెలిచినందుకే ఇంత ఎగిరి పడడం అవసరం లేదన్నారు. ఎవరిది అహంకారమో ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై పార్టీ నేతలు, కార్యకర్తలతో ఈ నెల 18న సమావేశాన్ని నిర్వహించి సమీక్షిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్డినల్ పూల ఆంథోనీకి కెటిఆర్ జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతదేశానికి చెందిన తొలి దళిత కార్డినల్, తొలి తెలుగు కార్డినల్ అయిన పూల ఆంథోనికి జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కెటిఆర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్డినల్ చేసిన సేవలు, మత పెద్దగా ఆయన సాధించిన ఘనతను గుర్తు చేశారు. కార్డినల్ పూల ఆంథోని నియామకం భారతదేశ క్రైస్తవ సమాజంలో ఒక చారిత్రక ఘట్టంగా పరిగణించబడుతుందని తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్ ఆయన్ను 2022, ఆగస్టు 27న కార్డినల్‌గా నియమించారని వివరించారు. ఈ నియామకం ద్వారా ఆయన భారతదేశంలో ఈ అత్యున్నత పదవిని పొందిన తొలి దళిత, తొలి తెలుగు వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కార్డినల్ బిషప్ కావడానికి ముందు ఆయన కడప డియోసెస్‌లో పాస్టర్‌గా సేవలందించారని తెలిపారు. ఆ తర్వాత, 2008 నుంచి 2020 వరకు కర్నూలు బిషప్‌గా విశేష సేవలందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం 2021 నుంచి ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని వివరించారు. కార్డినల్‌గా నియమితులైన పూల ఆంథోనికి ప్రత్యేక హక్కులుంటాయని తెలిపారు. భవిష్యత్తులో కొత్త పోప్‌ను ఎన్నుకునే 'కాన్‌క్లేవ్' ప్రక్రియలో ఓటు వేసే హక్కును ఆయన కలిగి ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోప్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న 135 మంది కార్డినల్స్‌లో నలుగురు భారతీయులుంటే వారిలో కార్డినల్ పూల ఆంథోని ఒకరు కావడం దేశానికి, తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని తెలిపారు. కార్డినల్‌ను బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజీవ్ సాగర్ కలిసి పూలే బొకేను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.